ప్రజాశక్తి
సోమవారం 12 డిసెంబర్ 2022 8 పేజీలు
గుంటూరు పల్నాడు







ప్రత్తిపాడు మండలం వంగిపురంలో నీట మునిగిన మిర్చి పైరు

- డెల్టాలో తడిసిన వరి ఓదెలు
- పల్నాడులో పత్తికి అపార నష్టం
- టార్పాలిన్ పట్టాల్లేక మిర్చి రైతుల దిగాలు

ముంచిన మాండూస్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మాండూస్' తుపాను తీరం దాటిన గుంటూరు, పల్నాడు జిల్లాలపై తన ప్రతాపాన్ని చూపింది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు అన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గుంటూరు జిల్లాలోని 10 మండలాల్లో భారీవర్షం కురిసింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో 15 మండలాల్లో భారీ వర్షం కురవగా మిగతా మండలాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. వర్షాలకు వరి, పత్తి, మిర్చి, కంది, పెసర, మినుము పంటలు తడిశాయి. చేతికి అందివచ్చిన పంటలు వర్షం పాలయ్యాయి. దీంతో పంటల పరిస్థితిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుంటూరు జిల్లాలో 1.69 2లో

8లో



దుగ్గిరాల మండలంలో పడిపోయిన వరిపైరును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నిబంధనల్లేకుండా ధాన్యం కొనాలి



భూముల నుండి గ్రామంలోకి ప్రదర్శనగా బయలుదేరిన బాధిత రైతులు, నాయకులు

సొసైటీ భూముల్లోకి దళితులు

- భూములు తిరిగివ్వాలని లేదా న్యాయమైన పరిహారం, మైనింగ్‌లో వాటా కోసం డిమాండ్ - 20వ తేదీ వరకూ గడువు
- స్పందించకుంటే 21న సాగు ప్రారంభిస్తామని ప్రకటన
- వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సొసైటీ భూముల విషయంలో యడవల్లి ఎస్సీ, ఎస్టీ రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వారికి న్యాయం చేయాల్సిందేనని బాధిత రైతులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 20వ తేదీలోగా గ్రామ సభలు నిర్వహించాలని, లేకుంటే 21వ తేదీ తర్వాత ఆ భూముల్లో సాగుకు సిద్ధమవుతామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఉదయాన్నే భూముల్లోకి వెళ్లి ఐదు గంటల పాటు వర్షపు జల్లుల్లోనే నిరసన తెలిపారు. అనంతరం అక్కడే సభ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చెందిన సొసైటీ భూముల్లో గ్రానైట్ నిక్షేపాలన్నాయనే కారణంతో ఈ భూములను టిడిపి హయాంలోనే కాజేయాలని చూసినా రైతులు వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో పోరాడి కాపాడుకున్నారని చెప్పారు. అప్పుడు రైతులకు మద్దతిచ్చిన వైసిపి అధికారంలోకి వచ్చాక మాత్రం భూములను 2లో

మోకీలు సర్జరీలు త్వరలో పునరుద్ధరణ

- గుండె ఆపరేషన్లనూ ప్రారంభిస్తాం
- కొన్ని వార్డుల్లో మంచాల కొరత
- ప్రజాశక్తితో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి

8 లో

దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

తూకంలో తేడాలపై ఉమ్మడి గుంటూరు జిల్లాలో 31 కేసులు 2 లో



విజ్ఞానం, చైతన్యం కోసం విజ్ఞాన కేంద్రాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ఆత్మకూరులో నిమ్మగడ్డ రామ్మోహనరావు విజ్ఞాన కేంద్రానికి ప్రారంభోత్సవం

2 లో

సొసైటీ భూముల్లోకి దళితులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుందని, టిడిపి హయాంలో భూములు తీసుకుందామనుకున్న వాళ్లకే ఈ ప్రభుత్వమూ కట్టబెట్టిందని మండిపడ్డారు. ఈ విషయంలో పేదలకు న్యాయం జరిగేదాక వారి పక్షాన ప్రజా సంఘాలు ఉంటాయని ఉద్ఘాటించారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో దళితులపై దాడులు, భూములు లాక్కునేందుకు యత్నించిన టిడిపి భంగపడిందని, వైసిపికీ అదేగతి పడుతుందని హెచ్చరించారు. దళితులకు వ్యతిరేకంగా రెవెన్యూ, పోలీసు అధికారులు ఏమీ చేసినా చెల్లవని, బాధిత రైతులే విజయం సాధిస్తారని భరోసానిచ్చారు. కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ భూములు తీసుకునే సందర్భంలో భూసేకరణ చట్టం-2013 అమలు చేయకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా పోలీసులతో నిర్బంధం విధించారని, అధికార వ్యవస్థ మొత్తం ఎమ్మెల్యే కనుసన్నల్లో మెలిగి భూములు లాక్కున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని, ఆ భూమిని వెంటనే తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ భూములు లాక్కోవడంతోపాటు పరిహారాన్నీ వారికి దక్కనివ్వలేదని మండిపడ్డారు. పరిహారం డబ్బు తీసుకున్న పెత్తందార్లపై కేసులు పెట్టినా వారిని అరెస్టు చేయలన్నారు. పెత్తందార్లపై సత్వరమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ జగన్న ఇళ్ల స్థలాల కోసం ఎకరం రూ.20 లక్షలు పెట్టి కొన్న ప్రభుత్వం సొసైటీ భూములకు పరిహారం మాత్రం రూ.8.30 లక్షలే ఇవ్వడం దారుణమన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని, లేదా గ్రానైట్ మైనింగ్‌లో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిహారంలో అక్రమాలకు పాల్పడ్డ తహశీల్దార్‌ను, ఇతర అధికారులను సస్పెండ్ చేయాలని, జీవో 270ను రద్దు చేయాలని కోరారు. అనంతరం పొలాల నుండి ప్రదర్శనగా నినాదాలు చేసుకుంటూ గ్రామంలోకి చేరుకున్నారు.ఇదిలా ఉండగా బాధిత రైతులు రోశయ్య, ఉయ్యాల అంకమ్మ తదితరులు మాట్లాడుతూ రూ.8.30 లక్షల పరిహారం కొంతమందికిచ్చినా తమకు మాత్రం ఇవ్వలేదన్నారు. అదేమని ప్రశ్నిస్తే అధికారుల విచారణలో పేరు లేదని చెప్పారని, తహశీల్దార్, ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోలేదని వాపోయారు. ఏడాదికి రెండు పంటలు పండే భూములను తమ వద్ద అన్యాయంగా లాక్కున్న మంత్రి తమకు తిండి గింజలు లేకుండా చేశారని ఆవేదనకు గురయ్యారు. గతంలో ఇతరులను పనులకు పిలుచుకెళ్లిన తాము ఇప్పుడు కూలి పనులకు వెళ్తున్నామని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.రవిబాబు, కె.రామారావు, పి.వెంకటేశ్వర్లు, సుబ్బారావు, విల్సన్, టి.పెద్దిరాజు, బాధిత రైతులు రాములయ్య వేల్పుల ఎమేల్యమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



నారాయణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మాదాల నారాయణ స్వామికి నివాళి

ప్రజాశక్తి-గుంటూరు: దోపిడీ, పీడన లేని సమాజం కోసం ఉద్యమించడమే కామ్రేడ్ నారాయణ స్వామికిచ్చే నిజమైన నివాళులు అని పలువురు నాయకులు పేర్కొన్నారు. సిపిఐ (ఎం.ఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు, మాజీ ఎం.పి మాదాల నారాయణ స్వామి 9వ వర్ధంతి సభ స్థానిక అరండల్‌పేటలోని ఎం.ఎన్.ఎస్ భవనంలో జరిగింది. ఈ సభకు పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.విష్ణు అధ్యక్షతన జరిగిన సభలో న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణ స్వామి జీవితం విప్లవ పార్టీ కార్యకర్తలకు ఆదర్శనీయమైనదని, అనుసరణీయమైనదని అన్నారు. ఆయన 99 ఏళ్ల జీవితంలో 77 సంవత్సరాలు విప్లవోద్యమంలోనే పనిచేశారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ప్రసాద్, పిఒడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, జిల్లా కార్యదర్శి శీలం యేసమ్మ, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యూ.గనిరాజు ప్రసంగించారు





రామ్మోహనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వి. శ్రీనివాసరావు, కెఎస్ లక్ష్మణరావు, పాశం రామారావు తదితరులు .. సభకు హాజరైన జనం

విజ్ఞానం, చైతన్యం కోసం విజ్ఞాన కేంద్రాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ఆత్మకూరులో నిమ్మగడ్డ రామోహనరావు విజ్ఞాన కేంద్రానికి ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచడంతోపాటు వివిధ అంశాలపై ప్రత్యేక శిక్షణలు, విజ్ఞానం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. నీతికి, నిజాయితీకి నిలువుటద్దంలా నిరాడంబరంగా మెలిగే నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు వంటివారు అరుదుగా ఉంటారని చెప్పారు. మండలంలోని అత్మకూరు గ్రామంలోని నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు నగర్‌లో ఆ పేరుతో సిపిఎం ఏర్పాటు చేసిన కామ్రేడ్ నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు విజ్ఞాన కేంద్రాన్ని వి.శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతకు ఈ కేంద్రం దిక్సూచిగా నిలవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పేదలు నివసిస్తున్న ఈ కాలనీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తన వంతు కృషి చేశానని, రానున్న కాలంలోనూ తన సహకారం కొనసాగుతుందని చెప్పారు. కాలనీవాసులకు ఇళ్ల పట్టాల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కేంద్రం ద్వారా బహుముఖ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ నిమ్మగడ్డ రామ్మోహన్‌నావు మంగళగిరి ప్రాంతంలో ఎమ్మెల్యేగా, సమితి అధ్యక్షులుగా ప్రజల కోసం ఎంతో పాటుపడ్డారన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల భవనాలు రామ్మోహన్‌రావు హయాంలోనే సమకూర్చినవేనని గుర్తు చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ అభివృద్ధిలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. నాడు ఎమ్మెల్యేగా పేదల సంక్షేమానికి ఆయన కట్టుబడ్డారని, ఇప్పుడున్న వారు పేదల ఇళ్లను కూల్చడం మినహా సంక్షేమం పట్టడం లేదని విమర్శించారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకర్ మాట్లాడుతూ సిపిఎం ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటుందని, ప్రజా సమస్యలపై రానున్న కాలంలో మరిన్ని ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎస్ఎస్ చెంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు బి.కోటేశ్వరి, తాడేపల్లి పట్టణ, మండల, దుగ్గిరాల మండల కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, జె.బాలరాజు, నాయకులు జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు కె.శివరామకష్ణయ్య, యు.దుర్గారావు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

ముంచిన మాండూస్



పత్తిపాడు మండలంలో నీట మునిగిని పత్తిపొలం

(మొదటి పేజీ తరువాయి)

లక్షల ఎకరాల్లో వరి, 83 వేల ఎకరాల్లో పత్తి, 41 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. పల్నాడు జిల్లాలో 1.13 లక్షల ఎకరాల్లో వరి, 3.25 లక్షల ఎకరాల్లో పత్తి, 1.40 లక్షల ఎకరాల్లో మిర్చి సాగైంది. డెల్టాలో వరి సాగు చేసిన వారికి కంటిపై కునుకు కరువైంది. కోసి కుప్పలు వేసిన వారు హమ్మయ్య అనుకుంటుండగా యంత్రాలతో నూర్పిడి చేసిన వారు వ్యాపారులకు అయినకాడికి అమ్ముకుంటున్నారు. కోసి కళ్లాల్లో ఉంచిన వరి ఓదేలు తడిసిపోయాయి. పల్నాడులో వరి సాగు ఆలస్యమవడం వల్ల కోతలకు మరోవారం పది రోజులు సమయం ఉందని, అందువల్ల నష్టం తక్కువగా ఉండవచ్చునని చెబుతున్నారు.

మెట్ట ప్రాంతంలో రెండు, మూడో విడత తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసి నేలరాలింది. ప్రదానంగా నర్సరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో పత్తి పంటకు ఎక్కువగా నష్టం జరిగింది. కాయ, పూత, గూడ తడిసి దెబ్బతింటున్నాయి. ఇప్పటికే తొలి, రెండో విడత తీతలు కొన్ని ప్రాంతాల్లో పూర్తికాగా, మూడోతీతకు కొంత మంది రైతులు సిద్ధమవుతున్నారు. ఆలస్యంగా సాగుచేసిన రైతులు రెండో విడత పత్తి తీయడానికి సమాయత్తం అవుతుండగా భారీ వర్షం నష్టం మిగిల్చింది. ధర బాగుందని పత్తి రైతులు సంతోష పడుతుండగా తుపాను వల్ల మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని, ఉన్న పంటకూడా నాణ్యత దెబ్బతింటోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిర్చి కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో భారీ వర్షాలు రైతులను కలవరపాటుకు గురిచేశాయి. పల్నాడు జిల్లాలోని దాదాపు 15 మండలాల్లో మిర్చి కోయడానికి సిద్ధంగా ఉన్న పొలాల్లో, కోసి కళ్లాల్లో ఆరబెట్టేందుకు సిద్ధంగా ఉన్న ప్రాంతాల్లో మిర్చికి నష్టం వాటిల్లింది. మిర్చి కోసి కల్లాల్లో ఆరబెట్టుకోవాల్సి ఉండగా ఇంత ఎండ తీవ్రత లేకపోవడం, పగటి వేళల్లోనూ ఆశాశం మేఘావృతమై ఉండటంతో మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో కోసి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసిపోయింది. రైతులకు ఉద్యాన శాఖ మూడేళ్లుగా పట్టాలివ్వడం లేదు. దీంతో పట్టాల కోసం రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఒక్కో పట్టా రూ.4 వేల పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు గుంటూరు జిల్లాలో సగటు వర్షపాతం 34.1 మిల్లీ మీటర్లు, పల్నాడు జిల్లాలో సగటు వర్షపాతం 26.4 మిల్లీ మీటర్లుగా నమోదవగా ఆదివారమూ రెండు జిల్లాల పరిధిలో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.

అత్యధికంగా పొన్నూరులో 72.4 మిల్లీ మీటర్లు, కాకుమాను 61.0, ప్రత్తిపాడు 60.6, పెదనందిపాడు 55.8, చేబ్రోలు 49.4, తెనాలి 30.8, మంగళగిరి 30.4, గుంటూరు తూర్పు 30.0, ఫిరంగిపురం 28.6, పెదకాకాని 28.2, గుంటూరు పశ్చిమ, 25.8, దుగ్గిరాల 23.8, వట్టిచెరుకూరు 23.2, కొల్లిపర 22.6, మేడికొండూరు 22, తాడేపల్లి 21.4, తాడికొండ 16.8, తుళ్లూరు10.8 మిల్లీ మీటర్లు.

పల్నాడు జిల్లా నాదెండ్ల 90.4, నర్సరావుపేట 66.8, యడ్లపాడు 62.2, చిలకలూరిపేట 51.2, రొంపిచర్ల 44.0, ముప్పాళ్ల 33.4, శావల్యాపురం 28.4, బొల్లాపల్లి 26.4, ఈపూరు 25.8, వెల్దుర్తి 25.6, మాచర్ల 25.0, బెల్లంకొండ 22.4, సత్తెనపల్లి 22.2, అమరావతి 20.6, నకరికల్లు 20.6, వినుకొండ 18.6, దుర్గి 18.6, పెదకూరపాడు 17.4, మాచవరం 14.8, కారంపూడి 14.8, క్రోసూరు 13.4, దాచేపల్లి 12.8, అచ్చంపేట 12.6, పిడుగురాళ్ల 11.4, రెంటచింతల 11.2, రాజుపాలెం 10.4, నూజెండ్ల 10.2, గురజాల 7.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



తూకంలో తేడాలపై 31 కేసులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపలు, చికెన్, మటన్ దుకాణాల్లో విజిలెన్సు అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. తూకంలో వ్యత్యాసం ఉండటంతో 31 కేసులు నమోదు చేశారు. 100 గ్రాముల నుండి 380 గ్రాముల వరకు తక్కువ తూకంతో చేపలను, చికెన్ అమ్ముతున్న వారిపైన, సరైన స్టాంపింగ్ లేని కాటాలు వాడుతున్న వారిపైన మొత్తం 31 కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలో 10, బాపట్ల జిల్లాలో 11, పల్నాడు జిల్లాలో 10 చొప్పున కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్‌పి ఎన్.వి.మాధవరెడ్డి తెలిపారు. తనిఖీల్లో సిఐలు లక్ష్మారెడ్డి, శ్రీహరి, ఎస్ఐ రామచంద్రయ్య, అసిస్టెంట్ జియాలజిస్టు ప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షేక్ సైదులు, తూనికలు, కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నాగార్జునకొండను సందర్శించిన ఎస్పీ దంపతులు




ప్రజాశక్తి-విజయపురిసౌత్

పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగసిరి లాంచీలో కొండకు వెళ్లారు.అక్కడ మ్యూజియం లోని బుద్ధుని చరిత్ర ,పాలరాతి విగ్రహాలను,శిల్పాలను, పురాతన కాలంలోని పనిముట్లను తిలకించారు. మాన్యుమెంట్స్ అయిన శ్రీ చైత్యం , మహాస్తూపం,9 అడుగుల బుద్ధుని పాల రాతి విగ్రహం, దలైలామా నాటిన బోధి వక్షం ను తిలకించారు.నాగార్జున కొండ చరిత్ర గురించి మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్, ఎస్పీ కి వివరించారు.అనంతరం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ను సందర్శించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శేరెడ్డి గోపిరెడ్డి ఎస్పీ రవిశంకర్ రెడ్డి దంపతులను ఆహ్వానం పలికి సత్కరించారు ఆయన వెంట మాచర్ల రూరల్ సి ఐ సమీముల్లా,విజయపురిసౌత్ ఎస్ ఐ పి. అనిల్ కుమార్‌రెడ్డి ఉన్నారు.



ఉప్పలపాడులో జూదరులు అరెస్టు

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

మండలంలోని ఉప్పలపాడులో ఆదివారం పేకాట స్థావరంపై తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పెదనందిపాడు ఎస్సై అశోక్ తెలిపారు. ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రూ.6,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కసు నమోదు చేశామన్నారు.

2వ సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో 'కృష్ణవేణి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నరసరావుపేట

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శనివారం విడుదల చేసిన మొదటి సంవత్సరం బిఎస్సి, మరియు బీకాం కంప్యూటర్స్ రెండవ సెమిస్టర్ డిగ్రీ ఫలితాలలో స్థానిక కష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్ని గ్రూపులలో యూనివర్సిటీ స్థాయిలో మంచి మార్కులు సాధించి పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు ఆది వారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కళాశాలలో విద్యార్థులకు అనుభవం కలి గిన అధ్యాపక బందంచే అధునాతన పద్ధతులలో విద్యాబోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అభినందించిన వారిలో కళాశాల డైరెక్టర్ కె నాసరయ్య అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వితంరాజుపల్లి ఐటిఐ కాలేజీ సిల్వర్ జూబ్లీ



ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని వితంరాజుపల్లి ఐటిఐ కాలేజీ సిల్వర్ జూబ్లీ వేడుకలు గత మూడు రోజులుగా ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ఐటిఐ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, డీజీఈటి ఎఫెక్ట్స్ కమిటీ మెంబర్ ఎన్.సుధాకర్‌బాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్డిడి ఎస్వివి ఆంజనేయులు, పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, పల్నాడు జిల్లా ఐటిఐ కన్వీనర్ సిహెచ్ యస్ వి ప్రసాద్ బాబు , రాష్ట్ర ప్రైవేటు అసోసియేషన్ ఉపాధ్యక్షులు రమేష్ బాబు, కేశవరాజులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. టెక్నికల్ విద్య, దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎలక్ట్రీషియన్ విభాగంలో ఉత్తమ విద్యార్థులుగా ఎంపికైన ఓ. జయరాజు, ఎల్ .వెంకటాద్రి రెడ్డి , మెకానికల్ ఫిట్టర్ విభాగంలో కె. రోహిత్ కుమార్ రెడ్డి, చీకటి కోటేశ్వరరావు విద్యార్థులకు షీల్డ్స్ తో పాటు రూ. 1016 /-నగదును బహూకరించారు. ఆటల పోటీలలో గెలిచిన విద్యార్థులకు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-అమరావతి : మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీ రామకృష్ణా హిందూ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కనుమూరి హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఎముకలు, కీళ్ల వైద్య శిబిరం నిర్వ హిం చారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కనుమూరి హాస్పిటల్స్ డాక్టర్ గిరిధర్ బోయపాటి మాట్లాడుతూ 200 మందికి ఉచితంగా బోన్ డెన్సిటీ,షుగర్,బీపీ,హిమోగ్లోబిన్ పరీ క్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు వైద్య శిబిరంలో అమరలింగేశ్వర పాలకమండలి సభ్యులు వి.సాంబశివరావు,అమరావతి ఎంఈవో శ్రీనివాసరావు, జూపూడి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ,కనుమూరి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి నివాళి



ప్రజాశక్తి -నాదెండ్ల

నాదెండ్ల గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు దావులూరి కనకయ్య (80) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. కనకయ్య పార్థివ దేహానికి కృష్ణా ఎన్టీఆర్ జిల్లాల వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనకయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైసిపి నాయకులు ఎన్.బాబు, ఎన్.అమరేశ్వరరావు, ఎన్. ఆంజనేయులు, టి.పేరయ్య, వి.రామచంద్ర రావు (సాం బయ్య), బి.వెంకట్రావు తదితరులు ఉన్నారు.



నూతన ఆవిష్కరణలపై రౌండ్ టేబులు సమావేశం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

నూతనంగా చేపట్టాల్సిన ఆవిష్కరణలు, స్టార్టప్ ల పురోగతి గురించి ఆదివారం కెఎల్ విశ్వవిద్యాలయం లోని ఎసిఐసి కెఎల్ స్టార్టప్ ఫౌండేషన్ నిర్వహించిన రౌండు టేబుల్ సమావేశానికి ఎసిఐసి విబాగం సిఇఒ అలోక్ గోవిల్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌండు టేబుల్ సమావేశంలో నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ ల గురించి విస్తత స్థాయిలో చర్చలు జరిపినట్లు తెలిపారు. కార్పోరేట్ రంగంలో ఇన్ఫోసిస్ లో సీనియర్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పని చేస్తున్న టి. మహేష్ , ఆర్కిటెక్చర్ రంగంలో అనుభవం కలిగిన పి.రవళి తమ అనుభవాలను సమావేశంలో యువతతో పంచుకున్నారని తెలిపారు. అటల్ సామాజిక ఆవిష్కరణల కేంద్రం సిఐఎఫ్, ఉచిత ఇంక్యుబేటిస్ అనుభవాలను నూతన ఆవిష్కరణలు చేపట్టనున్న యువతలో స్ఫూర్తి ని నింపాయని అన్నారు.ఈ కార్యాలయం లో కెఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కోనేరు రాజా హరీన్ , విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ , తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల వితరణ



ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పేద కుటుంబాలకు నిత్యవసరంల సరు కులు, కొంత నగదు ఆర్థిక సహాయం అందించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ప్రతి నెల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదుకోవడం జరు గుతుందని సభ్యులు తెలిపారు. స్థానిక జీవి మాదారం కార్యా లయం నందు నిత్యవసరాల సరుకులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నందు రెండు కుటుంబాలకు నగదు, ఆరు కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తు వులు, వితరణ చేశారు.

13న మండల సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి-అమరావతి

ఈ నెల 13 మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు అమరావతి సిఐటియు ఆఫీసులో అమరావతి మండల సిఐటియు ప్రథమ మహాసభ జరుగుతుందని సిఐటియు కార్యదర్శి బి. సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, కార్మిక, అసంఘటిత రంగటిత కార్మిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం సిఐటియు పోరాటాలు నిర్వహిస్తుందని ఈ నేపథ్యంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించడం కోసమై ఈ మహాసభ చర్చిస్తుందని సూరిబాబు తెలిపారు. అమరావతి మండలంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మిక అసంఘటిత కార్మికులు స్కీం వర్కర్లు పాల్గొని మహాసభను జయప్రదం చేయాల్సిందిగా కోరారు. మహాసభలో పల్నాడు జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు గంజి మాల రఘుబాబు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు.

అస్తవ్యవస్త జీవనశైలితో జీర్ణకోశ వ్యాధులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుతం అందర్నీ ఇబ్బంది పెడుతున్న లివర్, గ్యాస్, కడుపులో మంట వంటి జీర్ణకోశ వ్యాధులకు అస్థవ్యస్థ జీవనశైలే కారణమని సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ లోకేష్ అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో రమేష్ హాస్పిటల్స్ కన్సల్టింగ్ వైద్యులు డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ జీవన శైలిలో వచ్చిన మార్పుల వల్ల ఎక్కువ మంది గ్యాస్ట్రో ఎంటరాలజీ వద్దకు వెళుతున్నారని, లివర్, గ్యాస్ సమస్యలు, కడుపు ఉబ్బరం, మంట, మలబద్ధకం, విరోచనాల కేసులు అధికంగా వస్తున్నాయన్నారు.మన శరీరంలో జీర్ణ వ్యవస్థ నోటితో మొదలై మలద్వారం వరకూ కొనసాగుతుందనే విషయం అందరూ తెలుసుకోవాలన్నారు. బజార్లో, హోటళ్లలో దొరికే రకరకాల ఆహార పదార్థాలన్నింటిలో మంచి, చెడును గుర్తించే బాధ్యతలను నిర్వహించే జీర్ణవ్యవస్థ నేడు అవస్థలపాలవుతుందన్నారు. ఆహార అలవాట్లు, వ్యాయామం లేకపోవటం, కలుషిత వాతావరణం, బాగా కాగిన నూనె మళ్లీ మళ్లీ ఉపయోగించటం, సరైన నిద్ర లేకపోవటం, మానసిక ఒత్తిడులు జీర్ణకోశ వ్యాధులకు కారణాలని చెప్పారు. అవసరం ఉన్నా లేకపోయినా గ్యాస్, నొప్పుల బిళ్లలు వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయని, యాసిడ్, జీర్ణాశయ సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. గ్యాస్ వల్ల వచ్చే ఛాతినొప్పి గుండెనొప్పిని పోలి ఉంటుందని, కావున అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ లోకేష్‌ను అవగాహన సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డివిఆర్ మూర్తి, నూరుల్ అహమ్మద్, జోస్పిన్, రఘునాథబాబు, రామచంద్రరావు ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ లోకేష్

ఎడతెరిపిలేని వర్షం.. పంటలకు నష్టం..

- వరి, మిరప, పత్తి పంటలకు దెబ్బ
- చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గాల్లో అధిక వర్షం



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుపాను పల్నాడు జిల్లా రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. శుక్రవారం సాయంత్రం నుండి ప్రారంభమైన వర్షం శనివారం ఉదయం నుండి ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో వర్షాలు ఒక మోస్తరు నుండి భారీగా కురుస్తున్నాయి. చిలకలూరిపేట, నరసరావుపేట నియోజకవర్గాల్లో అధిక వర్షాలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా సాధారణ వర్షపాతం 12 మిల్లీమీటర్లు కాక 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో వరి, మిరప, పత్తి రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. వర్షానికి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పల్నాడు జిల్లాలోని ఎడ్లపాడు, నాదెండ్ల, రొంపిచర్ల, ముప్పాళ్ళ, నకరికల్లు ప్రాంతాల్లో కురిసిన అధిక వర్షానికి వరి, మిరప, పత్తి పంటలు కొంత మేర దెబ్బతిన్నాయి. కోతకొచ్చిన వరి, మిరప పంటలో వర్షం నీరు నిలిచి తీవ్రంగా దెబ్బతిని రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఈఏదాది సెప్టెంబర్, అక్టోబర్, మాసాల్లో కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట తీవ్రంగా తుడిచిపెట్టింది. కొంతమేర పంటను కాపాడుకొని సాగు చేస్తున్న పత్తి రైతుకు మాండూస్ తుఫాను తీవ్రంగా నష్టం చేసింది. కోతకు సిద్ధంగా ఉన్న పత్తి పంట వర్షం కారణంగా రంగు మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చేస్తున్నారు.

ముప్పాళ్ళ మండలంలో వరి కోత కొచ్చి, కోత కోసిన కొంత పంట కళ్ళల్లో ఉండటం వలన పంటను కాపాడుకునేందుకు రైతులు పట్టాలు కప్పుకొని కాపలా కాస్తున్నారు. జిల్లాలో ముందుగా సాగు చేసిన మిరప కోతకొచ్చిన పంటకు ఈ తుఫాన్ తీవ్రంగా నష్టాన్ని మిగిల్చింది. పండుపడి కోతకు సిద్ధమైన మిరప ఈ వర్షం కారణంగా దెబ్బతిని తాలు కాయలు వచ్చే అవకాశం అధికంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ఇలాగే కొనసాగితే రెండు రోజుల్లో పంటలన్నీ పూర్తిగా దెబ్బతిని రైతుల తీవ్రంగా నష్టపోతారని అంటున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం, చలిగాలులతో వాతావరణంలో మార్పులు రావడం వలన పంటలకు చీడపీడలు అధికమై వైరస్లు సోకే అవకాశం ఉందని అంటున్నారు.

మొక్కజొన్న రైతు విలవిల

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మాండుస్ తుఫాను ప్రభావం మండలంలోని మొక్కజొన్న రైతులకు ఒకింత నష్టాన్నే కలగజేసింది. మండలంలో రైతులు అత్యధికంగా మొదటి పంటగా పత్తి పంట వేశారు.తీవ్ర వర్షాల వలన పత్తి పంట ఉరకెత్తి పూర్తిగా దిగుబడి తగ్గింది. రైతులు పత్తి పంటను పీకి రెండవ పంటగా మొక్కజొన్న వేశారు. వర్ష ప్రభా వంతో మొక్కజొన్న పంటలో నీళ్ళు నిలిచి ఉరకెత్తే పరిస్థితి నెలకొందని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం ఉదయం వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ముప్పాళ్ళ ప్రాంతంలో వరి పంటల్లో నిలిచిన వర్షం నీరు, కోతలు సిద్ధంగా ఉన్న వరి వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను వివరాలను తెలుసుకున్నారు. చిలకలూరిపేట నియోజక వర్గ నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించి దెబ్బతిన్న పత్తి, మిరప పంటలను వారు పరిశీలించారు. పల్నాడు జిల్లాలో అధికంగా వర్షం కురిసిన ప్రాంతాల్లో పంటలు కొంతమేర దెబ్బతిన్నట్లు గుర్తించారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కోత దశలో ఉన్న వరి పంటకు రైతులు తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని తెలిపారు.



కార్మికులందరికీ కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

కార్మికులందరికీ కనీస వేతనాలు ఇవ్వాలని పల్నాడు జిల్లా సిఐటియు కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి అన్నారు. ఆదివారం పెదకూరపాడు మండల 4వ మహాసభ జరిగింది. ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలుపరచాలన్నారు. ఈనెల 18, 19న వినుకొండ లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శిగా షేక్ బందగి సాహెబ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .మరో 10 మందితో కమిటీని ఏర్పాటు చేశారు.

ఆర్బికేల్లో ధాన్యం కొనుగోలు : ఏవో

ప్రజాశక్తి - వినుకొండ

మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో వరి ధాన్యమును కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి అంజిరెడ్డి తెలిపారు. ప్రభుత్వము 100 కేజీలు కమాన్ రకము రూ.2040/, 75 కేజీలు, రూ.1530/, 40కేజీలు రూ.816/. అలానే గ్రేడ్ ఏ రకం 100కేజిలు రూ.2060/, 75 కేజీలు రూ.1545/, 40 కేజీలు రూ.824/బి రైతుల వద్ద కొనుగోలు చేస్తుందని, రైతులు తెచ్చే ధాన్యం నకు ఉచితముగా గోతాలు, హమాలీ కూలి,రవాణా ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఒక వేళ రైతులు పైన తెలిపిన ఖర్చులు పెట్టుకంటే ప్రభుత్వం తిరిగి అప్పగించుతుందన్నారు. ఏదైనా రైతుకు సమస్య వస్తే రైతు భరోసా కేంద్రంలో కస్టోడియన్ అధికారిని గానీ,మండల స్థాయి అధికారిని గానీ,లేక పోతే కలెక్టర్ (సి.యస్) పల్నాడు కార్యాలయం వారు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్కు తెలియపరచాలని, 8897798430 నంబరును తెలిపారు. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు తీసుకు రావాల్సిందిగా కోరుతున్నట్లు తెలిపారు.



హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాటం : ఆవాజ్

ప్రజాశక్తి-యడ్లపాడు

దేశ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, స్వేచ్ఛను పొందడానికి ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఇప్పుడు ప్రత్యేకంగా ఏర్పడిందని రాష్ట్ర అవాజ్ అధ్యక్షుడు మహమ్మద్ చిష్టి అన్నారు. ఆదివారం యడ్లపాడు ముస్లిం వాడలో స్థానిక పెద్దలు ఏర్పాటు చేసిన బహిరంగ సమా వేశంలో ఆయన ప్రసంగించారు. సభకు యడ్లపాడు మం డల సిపిఎం కన్వీనర్ తోకల కోటేవ్వరరావు అధ్యక్షత వహిం చారు. చిష్తి మాట్లాడుతూ దేశంలో జరిగిన పరిణామాలతో విచ్ఛిన్నకర శక్తులు విజృంభించి ప్రజలలో ద్వేషాలు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. లౌకికశక్తులకు ప్రజల అండదండలు ఇవ్వాలని కోరారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయిని మహమ్మద్ షకీల బేగం మాట్లాడుతూ బాబ్రిమసీదు విధ్వంసం అనంతర పరిణామాలను గురించి వివరిస్తూ.. కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న మతశక్తుల ప్రమేయంతో ప్రజల మతస్వేచ్ఛను హరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం ప్రసాదించిన లౌకికతత్వం పరిరక్షణకు అందరూ ముందుకురావాలని కోరారు. ప్రతి తల్లి తమ బిడ్డలకు చదువుతో పాటు చైతన్యపూరితమైన విజ్ఞానాన్ని అందించాలని కోరారు. హిందూ, ముస్లిం, క్రిష్టియన్లు అందరూ కలిసిమెలిసి ఉండే ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే శక్తులను ఎదగనీయకుండా ఉద్యమించాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు బడేసాహెచ్, వై.పుల్లయ్య పాల్గొన్నారు.

నిరంకుశంగా ప్రభుత్వ తీరు : సిఐటియు

ప్రజాశక్తి- నరసరావుపేట

రాష్ట్రంలో నిరంకుశంగా వ్యవహరిస్తున్న వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా చేస్తున్న నిరసనలకు అనుమతి ఇవ్వడం లేదని నిర్బంధాలతో ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను అణచి వేయాలని చూస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్ అన్నారు. సిఐటియు మండల మహాసభ ఆదివారం కామ్రేడ్ సయ్యద్ సైదా నగర్ లో నిర్వహించారు. ముం దుగా సిఐటియు పతాకాన్ని సభా ప్రాంగణం వద్ద సిఐటియు సీనియర్ నాయకులు ఏ వి కె దుర్గారావు ఆవిష్కరించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిఐటియు నాయకులు సయ్యద్ సైదా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన మహాసభకు ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సిహెచ్ నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజ నేయ నాయక్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ జరుగుతున్న ఉద్యమంలో ప్రభుత్వం భాగస్వామి కావడం లేదని, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని వైసిపి, టిడిపిలు ప్రశ్నించకుండా కేంద్ర ప్రభుత్వం వద్ద లొంగు బాటు ప్రదర్శిస్తూ కార్మిక,కర్షక,ప్రజా సమస్యలు గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయా రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిఐటియు అండగా ఉంటుం దన్నారు. సిఐటియు మండల కార్యదర్శి సిలార్ మసూద్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు సర్వస్వం అన్నట్లుగా అభి వృద్ధికి ఎటువంటి ప్రణాళికలు రూపొందించలేదని విమర్శించారు. కామ్రేడ్ కామినేని రామారావు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ సిలార్ మసూద్, ఈవూరి మస్తాన్ రెడ్డి, సహాయ కార్యదర్శిలుగా సిహెచ్ నాగలక్ష్మి, రుద్రయ్య, ఉపాధ్యక్షులుగా నిర్మలా, కొమ్ముల సురేష్, కోశాధికారిగా మస్తా న్వలి, కమిటీ సభ్యులుగా అల్లాబక్షు, జాన్ సైదా, ఎస్ఎండి హుస్సేన్, కాసు కోటిరెడ్డి, లలిత్ ప్రసాద్, బాజీలు ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్

సహకార సంఘాలతో రైతులకు మేలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

చిన్న, సన్నకారు రైతులకు సహకార సంఘాలతో ఎంతో మేలు జరుగుతుందని, వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పట్టు దలతో కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండ లం ధూళిపాళ్ల ఆంధ్ర బ్యాంక్ రైతు సేవా సహకార సంఘం 38వ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సమావేశానికి సహకార సంఘ చైర్మన్ నలబోతు శివన్నారాయణ అధ్యక్షత వహించారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ సహకార సంఘాల బ్యాంక్‌లు లాభాల బాటలో నడవడం స్ఫూర్తివంతమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.6,684 కోట్ల మేర రైతు బీమా వెసులుబాటు కల్పించామన్నారు. రైతు భరోసా కేం ద్రాలతో రైతులకు ఎంతో మేలు జరుగు తుందన్నారు. చంద్రబాబు హయాంలో 1623 కరువు మండలాలు ప్రకటించారని అన్నారు. రైతులు చెల్లించిన 716 కోట్ల ఇన్సూరెన్స్ ప్రీమియం డబ్బులు పసుపు కుంకుమకు దారి మళ్ళించిన మోసగాడు చంద్రబాబు అని విమర్శించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లా డుతూ సహ కార సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంద న్నారు. రైతు కష్టం ఎనలేని దని, సహకార సంఘాలతో తక్కువ వడ్డీతో రుణాలు అందుతాయని వివరించారు.

నమూనా వ్యవస్థలుగా పటిష్టంగా మారాలి

సహకార సంఘాలు నమూనా వ్యవ స్థలుగా పటిష్టం కావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నా రు. రానున్న రోజుల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని, జగన్మోహన్ రెడ్డి సం స్కరణలతో ఎంతో మేలు జరు గుతుందని వివరించారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణదేవరాయలు మాట్లా డుతూ ధూళిపాళ్ల సహకార సంఘం అభి వృద్ధి బాటలో నడవటం అభినందనీయమన్నారు 40 శాతం వృద్ధిరేటు కలిగి ఉండటం సమిష్టికి నిదర్శనమన్నారు. అయితే బ్యాంకుకు రావాల్సిన రుణాల శాతం తక్కువగా ఉందని వ్యవసాయ, నీటి పారుదల శాఖా మం త్రులు ఇద్దరూ చొరవ తీసుకొని బ్యాంకుకు రుణ పరిమితులు పెంచే అవ కాశం పరిశీలించాలని సూచించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 60 సహకార సంఘాలు ఉన్నాయని, వాటిలో అబివృద్ధి బాటలో నడుస్తూ దిగ్విజయంగా ముందుకు సాగుతున్నది ఒక్క ధూళిపాళ్ల సొసైటీ అని ప్రశంసించారు. అనంతరం వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్.రాజనారాయణ, వ్యవసాయ శాఖాధికారులు తదితరులు ప్రసంగిం చారు. ముందుగా మంత్రులు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. రైతులకు బ్యాటరీ స్ప్రేయ ర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గోవర్ధన్‌రెడ్డిని ఘనం గా సన్మా నించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి, మండల కన్వీనర్లు ఆర్.పురుషోత్తమరావు, ఎంపీపీ షేక్ ఎలవర్తి పార్టీ జైబూన్ బి, జడ్పిటిసి సభ్యు రాలు సంకటి నాగేశ్వరమ్మ,, సొసైటీ ఎండి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి


తెనాలి ప్రాంతంలో నీట మునిగిన వరి ఓదెలు


తెనాలి ధాన్యం రాసిని పరిశీలిస్తున్న అధికారులు


పొన్నూరులో వరి ఓదెలను పరిశీలిస్తున్న అధికారులు


చేబ్రోలులో పడిపోయిన వరిని పరిశీలిస్తున్న అధికారులు


దుగ్గిరాలలో కంకులను పరిశీలిస్తున్న అధికారులు

ఒరిగిన వరి.. తడిసిన ఓదెలు

- ధాన్యం రైతుల ఆశలకు గండి
- తుపాను తాకిడికి నీటిపాలైన పైరు
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి-తెనాలి

అకాల వర్షాలు వరి రైతుల ఆశలకు గండి కొట్టాయి. ప్రకృతి వైపరిత్యాల నుంచి ఎలాగైనా గట్టెక్కాలని రైతులు ఎంతగా ఎదురుచూసినా ప్రకృతి మాత్రం వదలలేదు. మాండోస్ తుపాను రూపంలో రైతుల ముందుకొచ్చింది. ఒక్కసారిగా కోతలకొచ్చిన పైరు తుపాను గాలులకు నేలకొరిగాయి, కోత కోసి ఆరేసిన ఓదెలు నీటి పాలైయ్యాయి.

తెనాలి, పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు ఒక మోస్తరు వర్షాలు, గాలులు వీచాయి. ఫలితంగా కొన్ని చోట్ల వరి పడిపోగా, కొన్ని చోట్ల నీటమునిగింది. తెనాలి మండల పరిధిలో 7వేల హెక్టార్లలో వరి సాగులో ఉంది. దాదాపు 90 శాతం పొలాలు కోతకు సిద్ధమయ్యాయి. 20 శాతం పొలాలు కోతలు కోశారు. ఐతానగర్ డొంకరోడ్డు, హాఫ్‌పేట, పెదరావూరు మరి కొన్ని చోట్ల కోతకు సిద్ధంగా ఉన్న పైరు గాలులకు నెలకొరిగిపోయింది. ఓదెలు వేసిన పైరు తడిచి పోయింది. నీట మునిగిన పైరును కాపాడుకునేందుకు రైతులు శత విదాలా ప్రయత్నిస్తున్నారు. చేతి కొచ్చిన పంట నేలపాలై పోయిందని, తడిసిన ధాన్యం కొనుగోలులో రైతుకు పూర్తిగా నష్టమేనని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం చెప్పుకోదగ్గ నష్టం ఏమీ ఉండదని, మొత్తం మీద ఒక ఒక శాతం మినహా నష్ట ఉండదని చెబుతున్నారు.

తడిసిన వరిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తడిసిన వరి సస్యరక్షణ చర్యలను మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ రైతులకు సూచించారు. ఆరబోసిన ధాన్య వర్షానికి తడిస్తే ఒక క్వింటాళ్‌కు ఒక కిలో ఉప్పు, నాలుగు కిలోల వరి ఊక కలిసి ఆరబెట్టాలని, కుప్పలు వేసేటపుడు ఎకరాకు 200కేజీల ఉప్పును కుప్పలో చల్లాలని, ఓదెలపై తడిసిన వరి మొలకెత్తే ప్రమాదం ఉన్న నేపథ్యంలో లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్ప కలిపి ఆ ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. ఓదెలు తడిసినట్లయితే ఒక కిలో ఉప్పు 20 లీటర్ల నీటిలో కరిగించి ఆ ద్రావణాన్ని ఓదెల మీద చల్లాలన్నారు. ఉప్పు పొడి అయితే ఎకరాకు 40 నుండి 60 కిలోల పొడిని కంకులకు తగిలేటట్లు సమానంగా చల్లాలని పేర్కొన్నారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు, అసిస్టెంట్ కలెక్టర్

వర్షాలకు, గాలులకు పడిపోయి, తడిసిన వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీమన్నారాయణ శర్మ ఆదివారం పరిశీలించారు. రూరల్ గ్రామం హాఫ్‌పేట ప్రాంతంలో వర్షం, గాలులకు పడిపోయిన వరిని, వర్షానికి తడవకుండా పట్టాలు కప్పి ఉంచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షం ప్రభావం పంటలపై ఎలా ఉందన్న విషయాన్ని రైతుల ద్వారా తెలుసుకున్నారు. అలాగే వెంకటకృష్ణాపురంలో ధాన్యం కొనుగోలును పరిశీలించారు. ప్రస్తుతం వర్ష ప్రబావం తగ్గిపోవటంతో పంటలకు పెద్దగా నష్టం లేదని, ఓదెలపై తడిసిన వరి, తడిసిన ధాన్యం రాసులు అతి తక్కువేనని, ఉప్పు ద్రావణం చల్లటం ద్వారా కొంత మెరుగైన ఫలితం ఉంటుందని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ చెప్పారు. ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అదికారుల వెంట ఏఈవోలు, రైతులు ఉన్నారు. దుగ్గిరాల: మండలంలోని ఈమని గ్రామంలో పొలాలను అధికారుల బృందం పరిశీలించింది. పంట దెబ్బతిన్న రైతుల వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. పంట ముంపుకు గురైన ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్నట్లయితే పంట నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణ డిఏఓఎన్ వెంకటేశ్వర్లు ఏడీఏ కే వెంకట్రావు ఏఓపి శిరీష ఏఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు. **చేబ్రోలు:** చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు దెబ్బతిన్న వరి పొలాలు పరిశీలించారు. రైతులకు పంటను కాపాడుకోడానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస నాయక్ , సిబ్బంది పాల్గొన్నారు. **పొన్నూరు రూరల్** మండలంలో కురిసిన వర్షాలకు, కోత దశలో ఉన్న వరి పైరును పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్. తిరుమల దేవి రైతలకు సూచించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్. వెంకట్రావు తదితరులు

'ఎదురీత' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

సుందరయ్యనగర్ సిపిఎం సీనియర్ నాయకులు, సీనియర్ జర్నలిస్టు ఉన్నం వెంకటేశ్వర్లు (వివి)రాసిన ఉద్యమ అనుభవాల ఎదురీత పుస్తకాన్ని తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదివారం లీలా సుందరయ్య కళావేదికపై ఆవిష్కరించారు. నమ్మిన సిద్ధాంతం, ఆచరణ, ఉద్యమాల్లో అనుకూల పరిస్థితుల్లో కనబరిచిన అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. తాడేపల్లి సుందరయ్యనగర్ ప్రాంతంలో ఉద్యమాభివృద్ధికి తోడ్పాటు నందించిన వైనాన్ని అందులో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు, సీనయర్ జర్నలిస్టు గడ్డెన్న, జానపద కళాకారుల రాష్ట్ర అధ్యక్షులు జగన్, తాడపేల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కె.కరుణాకర్‌రావు, మాజీ ఎంపిటిసి ఉషారాణి తదితరులు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు ఉపయోగపడే తన అనుభవాలను కొన్నింటిని ఈ పుస్తకంలో పొందుపరిచారని తెలిపారు.



బహుమతులను అందజేస్తున్న కాంతిరాణా టాటా తదితరలు

రోగాలు రాకుండా చూసుకోవడమే ముఖ్యం

విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా

ప్రజాశక్తి-తాడేపల్లి

వ్యాధులు వచ్చినాక బాధపడే కంటే రాకుండా చూసుకోవడంతో పాటు అందరూ ఆరోగ్యం కాపాడుకోవాలని విజయవాడ సిటిపోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా తెలిపారు. స్థానిక మణిపాల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం గుడ్ హెల్త్ రన్ రెండో ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మణిపాల్ ఆసుపత్రి నిర్వహిస్తున్న గుడ్ హెల్త్ రన్ అభినందనీయమని ప్రశంసించారు. నడక వల్ల మనిషి ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాల గురించి వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు మాట్లాడుతూ అవయవదానానికి మరింత మంది ముందుకు రావాలని కోరారు. ఒక వ్యక్తి అవయవ దానం చేస్తే ఎనిమిది మంది కొత్త వ్యక్తులకు కొత్త జీవితాన్ని అందించవచ్చని చెప్పారు. జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయవదానం చేయడం వల్ల దాతతో పాటు గ్రహీత కుటుంబాలు ఆనందంగా ఉంటాయని చెప్పారు. అవయవ మార్పిడి అవసరం ఉన్న వారిని బంధువులు, స్నేహితులు, సహోద్యోగులు, పరిచయస్తులను కూడా ఇది ప్రభావితం చేస్తుందని తెలిపారు. అవయువదానంపై మణిపాలు ఆసుపత్రి పెద్దఎత్తున అవగాహన కలిగిస్తోందని అభినందించారు. మణిపాల్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టరు సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ మణిపాల్ ఆసుపత్రి నిర్వహిస్తున్న సెకండ్ ఎడిషన్ రన్‌కు విజయవాడ పౌరుల నుంచి వస్తున్న ఆదరణ,స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. మణిపాల్ ఆసుపత్రి నేడు చేపట్టిన ఐదు, పది కిలోమీటర్ల రెండు కేటగిరిలలో నాలుగువేల మందితో గుడ్‌హెల్త్ రన్ చేపట్టడం జరిగిందని చెప్పారు. 5కె,10కె రన్‌లలో విజేతలకు నగదు బహుమతి చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో పౌరులు, విద్యార్థులు, ఫిట్‌నెస్ సెంటర్లు, రన్నర్లు, స్పోర్ట్స్ క్లబ్‌ల నుంచి పాల్గొన్నట్లు తెలిపారు.


ప్రదర్శనలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబురావు




మాట్లాడుతున్న సీఐటీయూ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ

సంక్షేమ రాజ్యమంటే జీతాలు ఇవ్వక పోవడమా..?

- మంత్రి వర్గ సమావేశాల్లో కార్మికుల సమస్యలపై ప్రకటన చేయాలి
- సిఐటియు రాజధాని డివిజన్ మహాసభలో రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబురావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి

ప్రజాశక్తి - తుళ్లూరు

పెండింగ్ జీతాలు చెలిలంచి, కార్మికుల పని భద్రత కల్పించేలా ఈ నెల 13న జరిగే మంత్రివర్గ సమావేశంలో రాజధాని పారిశుధ్య కార్మికుల సమస్యలపై మున్సిపల్ శాఖా మంత్రి ఆది మూలపు సురేష్ ప్రకటన చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం తుళ్లూరులో సిఐటియు రాజధాని డివిజన్ మూడోవ మహా సభ జరిగింది. కార్మికులు గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో బాబురావు మాట్లాడుతూ జనవరి నుంచి పారిశుధ్య కార్మికులను తొలగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారని, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని కార్మికుల కొనసాగింపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్మికులు ఖాళీ కంచాలతో ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు. సంక్షేమ రాజ్యం అంటే కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడమా..అని ప్రశ్నించారు. కార్మికులకు నాలుగు నెలల జీతాలు చెల్లిస్తున్నట్లు సిఆర్‌డిఎ కమిషనర్‌కు చెప్పి నాలుగు రోజులైందని, తీరా చూస్తే ఒక్క నెల జీతం జమ చేయడం ఏమిటని నిలదీశారు. పారిశుధ్య కార్మికులతో పాటు అసెంబ్లీ, హైకోర్టులో పనిచేసే కార్మికులను కూడా తగ్గిస్తున్నారని, జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు.ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు.సభలో సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ కేంద్రం,రాష్ట్రాల్లోని పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని, ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలుచేయమని అడిగితే అరెస్టులు,అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేస్తున్నారని సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ అన్నారు. ప్రశ్నించే వారిపై దేశంలో,రాష్ట్రాల్లో నిర్బంధాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించక పోవడమే కాకుండా ఉన్న పని కూడా లేకుండా చేస్తున్నారని అన్నారు. కార్మికులకు పని భద్రత లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.పాలకుల నిర్బంధాలకు వ్యతిరేకంగా,పని భద్రత, కనీస వేతనాలు,హక్కుల కోసం కార్మికులు చైతన్యంతో సమరశీలపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.తొలుత మహాసభ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి జెండా ఆవిష్కరించారు. మహాసభకు చెరుకూరి సుశీల,కె గ్రేస్,రవి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. మహాసభలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు సందేశం ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సిఆర్‌డిఎ పరిధిలోని పారిశుధ్య కార్మికులను ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకొని పని భద్రత కల్పించాలని, రూ.21 వేలు జీతం చెల్లించాలని, కార్మిక చట్టాలను అమలు చేయడం తదితర అంశాలపై మహాసభలో తీర్మానం చేశారు. గత కార్యక్రమాల సమీక్షలను సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మహాసభలో ప్రవేశ పెట్టారు. అనంతరం సిఐటియు రాజధాని డివిజన్ నూతన అధ్యక్ష, కార్యదర్శిగా ఎం రవి,ఎం భాగ్య రాజును ఎన్నుకున్నారు. సభలో అనంతరం రవి, భాగ్యరాజుతో పాటు 19 మందితో నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వి. వెంకటేశ్వరరావు, పేరం బాబూరావు,పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఆర్ వేణు, సీ హెచ్ సుశీల,రాజధాని పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



చల్లగుండ్లలో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని చల్లగుండ్లలోని ఉదయ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు మేడికొండ రామిరెడ్డి, సాగి కోటేశ్వరరావు ప్రారంభించినట్లు వైద్యులు కార్డియాక్ శివ తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు 150 మందికి ఈసీజీ 2డి ఎకో ,షుగర్, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి ఒక్కరూ ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గుండ్లపల్లి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు ప్రత్యూష, ఫణీంద్ర రెడ్డి మహేశ్వరావు వేణుగోపాలరావు తమ సిబ్బందితో కలిసి సుమారు 1140 మందికి వివిధ రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఉద్యోగులు ఒక బృందంగా ఏర్పడి తమ గ్రామానికి సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. మిత్రులు, గ్రామస్తుల సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, సచివాలయ సిబ్బంది కమిటీ అధ్యక్షులు సిహెచ్ మీరా, షేక్ ఇమామ్ వలి, కరాల పాటి పింటూ, బుడే, తదితరులు పాల్గొన్నారు.



చదలవాడ అరవిందబాబుకు పితృవియోగం

ప్రజాశక్తి-నాదెండ్ల

నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తండ్రి చదలవాడ మోహన్ రావు (90) అనారోగ్యంతో మృతి చెందారు. నాదెండ్ల మం డలం సాతులూరులో ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచారు. గ్రామంలో ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి పలువురు నివాళులర్పించారు. మోహన్‌రావు అంతిమయాత్రలో జోన్ -2 , ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, నాదెండ్ల మండల అధ్యక్షులు ,పలువురు నాయకులు పాల్గొన్నారు.

15న మండల ప్రజా పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - యడ్లపాడు

ఈ నెల 15న యడ్లపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వ హిస్తున్నట్లు ఎంపిడిఓ వై.హనుమారెడ్డి తెలిపారు. ఎంపిపి పిడతల ఝాన్సీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. అలాగే, ఎపిపి అనుమతితో ఇతర అంశాలపై చర్చించడం జరుగుతుందని చెప్పారు. మండలం పరిది.లోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల పూర్తి సమాచారం, ప్రగతి వివరాలతో హాజరు కావాల్సిందిగా కోరారు.

రద్దీ రహదారి అధ్వానం

- దారుణంగా చిలకలూరిపేట-మురికిపూడి వయా రామచంద్రపురం రోడ్డు
- గుంతలమయం, దుమ్ముధూళితో వాహనదారులు ఉక్కిరిబిక్కిరి
- చుక్కలు కనిపిస్తున్నాయంటున్న వాహనచోదకులు



ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట నుంచి మురికిపూడి వయా రామచంద్రపురం మీదుగా వెళ్లే రహదారి వాహనచోదకులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. భారీవాహనాలు, కార్లు, మోటారు సైకిళ్ల చోదకులకు, సైకిల్‌పై ఆకుకూరలు తీసుకొని వచ్చి చిలకలూరిపేటలో అమ్ముకునే వారికి, పాఠశాల బస్సులకు, పట్టణంలో ఉంటూ గ్రామాలకు ఉద్యోగాల నిమిత్తం వెళ్లే వారితో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. రామచంద్రాపురం వద్ద నుంచి మురికిపూడి వెళ్లే మార్గంలో ఉన్న అనేక గ్రానైటు, పొగాకు, ఇతర పరిశ్రమలు ఉండటంతో, భారీ వాహనాలతో సరుకు రవాణా జరగటం వల్ల రోడ్డు కిరువైపులా పెద్ద కుంతలు ఏరడ్డాయి. గ్రానైట్ పరిశ్రమలలోని నీటి పారుదలకు సౌకర్యాలు లేకపోతుండటం తో ఆ నీరు కుంటలోకి వచ్చి చేరడం వల్ల అవి లోతైన చెరువులను తలపిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు భయాందోళనలకు గురువుతున్నారు. చిలకలూరిపేట నుంచి రామచంద్రపురం మీదుగా మురికిపూడి, వేమవరం, బల్లికురవ మీదుగా అద్దంకి, దర్శి, కనిగిరి పోవు మార్గము కావడంతో గ్రానైట్ సరఫరాకు ఇది ప్రధాన రహదారిగా ఉంది. పైగా ఈ రహదారి వల్ల ఖాళీగా ఉన్న పొలం

చిలకలూరిపేట నుంచి అద్దంకి సుమారు పది,పదిహేను కిలో మీటర్ల దూరం తగ్గి టోల్ గేట్లు, ఇతర చెకింగ్ లేకపోవడంతో గ్రానైట్ వాహనాల రద్దీ బాగా పెరిగింది. దీంతో రోడ్డుపై ఎక్కడబడితే అక్కడ పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు సగం సగం కోసుకుపోవడం, రాళ్లు ఎగిరి పడుతుండటంతో రామచంద్రపురం, మురుగుపూడి వేమవరం వంగపాలెం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిలకలూరిపేట నుంచి తాతపూడి మీదగా మురికిపూడి పోవ డానికి నాలుగైదు కిలోమీటర్లు, దూర ప్రాం తాల నుంచి వచ్చే వారికి 10 కిలో మీటర్ల దూరం పెరుగుతుంది. కనుక వాహన చోదకులు ఎక్కువగా ప్రతి వాహనాన్ని రామచంద్రపురం (మంగళ పాలెం) మీదుగా చిలకలూరిపేటకు వెళ్లేందుకు అల వాటుపడ్డారు. ముందు వాహనం వెళుతుంటే విపరీతంగా పైకి లేచే దుమ్ము కార ణంగా రోడ్డు సరిగా కనిపించక ప్రమాదాలకు గురైన సందర్భాలు చాలా ఉన్నాయని రామచంద్రపురం గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారి ప్రక్కనే ఉన్న మురికిపూడి, రామచంద్రపురం మొత్తము ధూళితో నిండిపోతుండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఆస్మా తదితర వ్యాధుల బారిన పడుతున్నారంటున్నారు. దుమ్ము తో నిండిపోయిన పంటలు నాణ్యతను కోల్పోయి తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కొన్ని ఎకరాలలో పంటలను వేయడం కూడా మానుకున్నట్టు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆ గ్రామ పంచాయితి ప్రెసిడెంట్లు పట్టించుకుని పరిశ్రమల వారి సహాయ సహకారాలతో కనీసం రోడ్లపై గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. రోడ్ల పక్కనే ఉన్న చెట్లను కొట్టి రహదారి సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు,వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.


బావి కనిపించకుండా మట్టితో కప్పి వేసిన చిత్రం


ఖాళీగా ఉన్న పొలం


గుంతమయంగా ఉన్న రోడ్డుపై వెళుతున్న ద్విచక్రవాహన చోదకులు

ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-రాజుపాలెం

మాండూస్ తుఫాను వల్ల కోసిన వరి పంట, నూర్చిన ధాన్యం పంట పొలాల్లో ఉండటంవల్ల రైతులకు తీవ్ర నష్టం కలిగించిందని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని బలిజెపల్లిలో కోత కోసిన వరి పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఇంతవరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదని, వెంటనే ప్రభుత్వం మద్దతు ధర కల్పించి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులను ఆదు కోవాలని, క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని అన్నారు. మండలం లో ఈ ఏడాది 25 శాతం మాగాణిని రైతులు క్రాప్ హాలిడే గా ప్రకటించడం వల్ల వరి ధాన్యం దిగుబడి తగ్గింది కనుక ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మిర్చి పంట కూడా కోసిన మిర్చి పంట కళ్ళాల్లో ఉండటంతో రైతులు ఇబ్బందికి గురవుతున్నారు. ప్రత్తి పంటకు కూడా గిట్టుబాటు ధర లేదని ఈ వారం క్వింటాకు 1500 రూపాయల ధర తగ్గడం వల్ల రైతులకు నష్టం జరుగుతోందన్నారు.


దెబ్బతిన్న వరి పంటను పరిశీలించిన టిడిపి నాయకులు

ప్రభుత్వం వెంటనే సీసీ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్తిని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రబి సాగు ప్రారంభించాలంటే రైతుల దగ్గర డబ్బులు లేవు కనుక వారికి పెట్టుబడి కింద వెంటనే ప్రభుత్వం రుణాలు ఇప్పించాలని తెలుగుదేశం పార్టీ రాజుపాలెం మండలం తరపున డిమాండ్ చేశారు. పరిశీలించిన వారిలో రైతులతో పాటు తెలుగుదేశం రాజుపాలెం మండల పార్టీ అధ్యక్షుడు పల్లపాటి పెద్ది రాజు, మద్రి మల్లయ్య, పిండి పేద తిరుపతియ్య , అలా వెంకట్రామయ్య, పల్లపాటి బాల వెంకటేశ్వర్లు,పిండి వెంక టేశ్వర్లు, నల్ల మోతుల శ్రీనివాసరావు (వాసు), జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ అల్లాభక్షు, కార్యకర్తలు ఉన్నారు.

ఐకమత్యంగా ఉండాలి : ఎమ్మెల్యే గోపిరెడ్డి

ప్రజాశక్తి-నరసరావుపేట: విశ్వబ్రాహ్మణ సంఘీయులు ఐక్యమత్యంగా ఉండి, సమ స్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపి రెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక పట్టాభిరామ స్వామి కళ్యాణమండపంలో జరిగిన పల్నాడు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీలకు సంక్షేమ పథకాలకు రూ. 86 వేల కోట్ల వైసిపి ప్రభుత్వం కేటాయించిందన్నారు. విశ్వబ్రాహ్మణులకు ఆరామ క్షేత్రం, స్వర్ణకారుల అసోసియేషన్ భవన్ నిర్మాణం చేస్తామని, నియోజకవర్గంలోని విశ్వబ్రాహ్మణ సంక్షేమం అభివృద్ధి



కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం ఏర్పాటు చేయాలని పెద్దలు అడిగినప్పటికీ, టిడిపి నాయకులు కోర్టుకు వెళ్లిన విషయంలో ప్రస్తుతం తాను ఏమి చేయలేనని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ టి. శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోగా సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.



కాత్యా వాగుపై వంతెన నిర్మాణం చేపట్టండి

ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- నరసరావుపేట



నరసరావుపేట పట్టణం నుండి గుంటూరు వెళ్ళే రహదారిలో ఉన్న కత్యా వాగు పై వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వరద నీరు ప్రవహిస్తున్న కాత్యా వాగును ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం పిడిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గుంటూరు రోడ్డులో శ్మశానం ఎదురుగా ఉన్న కత్యావాగు కొద్దిపాటి వర్షాలకే తీవ్రమైన వరద ప్రవాహం ఉంటుందని, దీనిపై చాలాకాలంగా వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దలకు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు చప్టా పైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదు ర్కొం టున్నారని, నీటిలో కొట్టుకుపోయి ప్రమాదాలకు గురవుతున్నా రన్నారు. ముఖ్యంగా పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థ, ముంపు ప్రాం తాల రక్షణతో పాటు కాత్యా వాగుపై వంతెన నిర్మాణం వెంటనే చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. పిడిఎం జిల్లా కార్యదర్శి జి రామ కృష్ణ, నల్లపాటిరామారావు, శ్రీనివాసరావు ,బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఐకెఎస్ జెండాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి, పెదనందిపాడు

ఎఐకెఎస్ జాతీయ మహాసభలు కేరళలో జరుగుతున్న సందర్భంగా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా, పెదనందిపాడు మండలం పాలపర్రు గ్రామంలో ఆదివారం ఉదయం ఏఐకేఎస్ జండాను మండల అధ్యక్షులు ముద్దన వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేసి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.గతేడాది పంట నష్ట పోయిన రైతులకు పూర్తి నష్ట పరిహారం అందించాలని అన్నారు .రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ ధరలకు ఎరువులు, పురుగుమందులు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు జంపని రామారావు, నంగినేని హరిబాబు, దొప్పలపూడి రమేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఖాజా గ్రామంలో ఏఐకేఎస్ మహాసభల జయప్రదం కొరకు రైతు సంఘం జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు తమ్మా ప్రసాద్ రెడ్డి, భీమిరెడ్డి సత్యమారెడ్డిః, అప్పుగిగట్ల ప్రకాశరావు, ఏ పున్నయ్య, ఎం నాగేశ్వరరావు, టి నాగేశ్వరరావు, బి శివారెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడికొండ

కేరళ రాష్ట్రం తరహాలో వరికి ప్రోత్సాహకాన్ని ఆంధ్రలో రైతులకు కూడా అమలు చేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు కనగాల పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని మొతడక గ్రామంలో ఏఐకేఎస్ జెండా ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేరళలో జరుగు ఏఐకేఎస్ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. రైతులకు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో చింతల భాస్కరరావు, మన్నవ సాంబశివరావు, మన్నవ వెంకటేశ్వరరావు, బాణావత్ భద్రయ్య, పాల్గొన్నారు.



పెదనందిపాడు మండలం పాలపర్రులో జెండావిష్కరణ నాయకులు



మంగళగిరి మండలం ఖాజా గ్రామంలో జెండావిష్కరిస్తున్న నాయకులు



తాడికొండ మండలం మోతడకలో జెండావిష్కరిస్తున్న నాయకులు



శివను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

షార్ట్ ఫిలిం కళాకారుడు శివకు సత్కారం

ప్రజాశక్తి- తెనాలి

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై, నటించిన సినిమాలపై, ఆయన రాజకీయ జీవితంపై జరిగే చర్చా కార్యక్రమం ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగింది. డాక్టర్ వేమూరి శేషగిరిరావు, పావులూరి రాంబాబు ఎన్టీఆర్ వ్యక్తిత్వం పై ప్రసంగించారు. అలాగే కళాకారుల సత్కారాల పండుగలో భాగంగా ప్రముఖ షార్ట్ ఫిలిమ్ కళాకారుడు తెనాలి శివను సన్మానించి, జ్ఞాపికను అందించారు. సమన్వయ కర్తగా డాక్టర్ అయినాలమల్లేశ్వరరావు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గల్లా మధుసూదనకుమార్ , ఈదర వెంకట పూర్ణ చంద్, ఎం. కోటేశ్వరరావు, డి.భవాని, ఎన్టీఆర్ జగన్, ఎం. రాఘవరావు, కె. ఏడుకొండలు, కె. నాగభూషణం, ఆంజనేయులు, జి. మురళీక్రిష్ణ, వి.శివనారాయణప్రసాద్, రామలింగేశ్వరరావు, పి.సోమశేఖర్ తదితరులుపాల్గొన్నారు.

ప్రజా రంజకం రంగారావు కవిత్వం..



పుస్తకాన్ని ఆవిస్కరిస్తున్న సాహితీవేత్తలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా రంజకం డాక్టర్ రావి రంగారావు కవిత్వం అని ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు అన్నారు. గుంటూరు తాలూకా ఆఫీసు ప్రాంగణంలోని, పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం 'అమరావతి సాహితీమిత్రులు" నిర్వహించిన 'రావి రంగారావు సాహిత్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ సభ'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా చైతన్యం రావి రంగారావు కవిత్వ లక్ష్యమని, అందుకు తగిన కవిత్వ నిర్వహణ విధానాలు ఎంచుకొని నిబద్ధతతో అయిదు దశాబ్దాలుగా సాహిత్య రచన చేస్తున్నారని కొనియాడారు .కవిత్వం రాయటంతో పాటు ఎందరితోనో కవిత్వం రాయించిన ఘనత రంగారావుదని తెలిపారు. వచన కవిత్వం పలచనై పోతున్న సమయంలో స్పష్టంగా సూటిగా భావ యుక్తంగా అభ్యుదయ విప్లవ భావాలతో దూసుకొచ్చిన శక్తి వంతమైన మినీ కవితకు ఒక ప్రత్యేక స్థానం కల్పించి కవిత్వ రచన ఒక ఉద్యమంగా భావించి దేశ మంతటా తిరిగి ప్రచారం చేశారని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ కేవలం మినీ కవితలే కాకుండా విశిష్ట శైలిలో జన రంజక వచన కవిత్వం కూడా పండించారని చెప్పారు. ఇంకా బాల సాహిత్యం, బోధనా రంగ గ్రంథాలు, సరళ సుందరమైన శైలిలో పద్య గ్రంథాలు, పిల్లలలో కవిత్వ రచనా నైపుణ్యాల పరిశోధన మొదలైన గ్రంథాలు కూడా రాసి యాభై ఏళ్లలో యాభై పుస్తకాలు రాశారని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ రంగారావు ఒక కావ్యకర్తగా చేస్తున్న సాహితీ కృషిని, ఒక సాహిత్య కార్యకర్తగా కూడా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సూర్యదేవర రవికుమార్, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, అబ్దుల్ రజా హుస్సేన్, సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ఎం. పాపిరెడ్డి, డాక్టర్ టి. సేవాకుమార్, డాక్టర్ రమణ యశస్వి, తదితరులు మాట్లాడారు. అనంతరం రంగారావు దంపతుల్ని ఘనంగా సత్కరించారు.



వృద్ధురాలకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ కష్ణమోహన్

దంత సంరక్షణ అవసరం

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

విద్యార్థులు దంత సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని చిలకలూరిపేట అమ్మ దంత వైద్యశాల డాక్టర్ పేర్ని కష్ణమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక అశోక హై స్కూల్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన దంత అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. అనంతరం స్థానిక రోటరీ క్లబ్ వారు ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య చికిత్స శిబిరంలో 50 మందికి పైగా చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాల కారణంగా పొరుగు గ్రామాల నుంచి దంతాలు చూపించుకునే బాధితులు ఎక్కువమంది రాలేకపోయారని క్లబ్ అధ్యక్షులు కె విక్టర్ జాన్ పాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ పోపూరి నాగేశ్వరరావు రీజినల్ చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ, రోటరీ క్లబ్ కార్యదర్శి కోశాధికారి వైకే రామిరెడ్డి, సిహెచ్ ప్రతాప్ కుమార్, ఎన్ విఎస్ నాగేశ్వరరావు, ఎం. మధు, పాఠశాల పాలకవర్గ సభ్యులు నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

- **ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ శ్యాంప్రసాద్**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బ్రెస్టు కాన్సర్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.శ్యాం ప్రసాద్ అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ క్యాపిటల్ హోటల్స్‌లో ఆదివారం ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళలలో ఎక్కువగా వస్తున్న బ్రెస్టు క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్ ఇతర క్యాన్సర్ సంబంధిత విషయాలపై ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రాథమిక దశలోనే తెలుసుకోగలిగితే మెరుగైన వైద్యం అందించి క్యాన్సర్ ప్రభావాన్ని తగ్గించవచ్చునని శ్యాం ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఒమెగా ఆస్పత్రి చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.జి.నాగ కిషోర్ వారి వైద్య బృందం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణలోని ప్రముఖ వైద్యుల సమక్షంలో అధునాతన పరికరాలు, వైద్య విధానాలపై ప్రత్యేక సదస్సుని నిర్వహించారు. ఒమేగా హాస్పిటల్‌లో స్త్రీలలో వచ్చు రొమ్ము క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో తెలుసుకొనుటకు అల్ట్రా సౌండ్, మామోగ్రామ్, బయాప్సీ ,ఎఫ్‌నాక్, పిఈటి-సిటీ పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స ప్రారంభిస్తామన్నారు. సర్జరీ, కీమోథెరపీ, రేడియో థెరపీ వంటి వైద్య విధానాలతో క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించవచ్చునని డాక్టర్ నాగ కిషోర్ తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. ప్రభావతి, డాక్టర్ నిమ్మల శేషయ్య, ఒమేగా హాస్పిటల్స్ వైద్య బృందం డాక్టర్. బి. శ్రీకాంత్, డాక్టర్ యు. సుమన్, డాక్టర్. ఎస్.ప్రతాప్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఎన్ వి ఎస్ ప్రవీణ్ , డాక్టర్ టి. మహతి , డాక్టర్ పి. గీతా రుక్మిణి, డాక్టర్ పి. హనీషా పాల్గొన్నారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్యాం ప్రసాద్

రేపు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ మహాసభ

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ మహాసభ ఈనెల 13వ తేదీన మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ తెలిపారు. ఈ మహాసభలో ఏఐఆర్‌టి డబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, గుంటూరు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి వై నేతాజీ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఆటో డ్రైవర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రాజీవ్ సెంటర్లోని రామనాథం చినుకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవా ఆశ్రమంలో ఆదివారం ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పల్నాటి నాగేశ్వరరావు హాజరై వృద్ధులకు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వప్రపంచాన్ని చూపేది కళ్ళు అని, కళ్ళే లేకపోతే ప్రపంచం అంధకారమవుతుందన్నారు. ఆశ్రమం ఎంతో ప్రాధాన్యత ఉన్న కళ్ళు సంబంధించిన వైద్యాన్ని వృద్ధులకు కల్పిస్తూ ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేయడం అభినందనీయమన్నారు. వృద్ధుల అనుభవాలు సమాజానికి సంపదన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి బిజెపి నాయకులు కాకుమాను భాగ్యేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి వై రమేష్, ఆశ్రమం అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పేరుకుపోయిన పూడిక



పూడిక తీసి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రురోడ్డులో గల మార్కెట్ యార్డ్ వద్ద మురుగు కాలువ రాళ్ళ, పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. సక్రమంగా పూడిక తీయకపోవడంతో పారుదల సరిగా లేక సమస్య తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. దీని వల్ల కొద్దిపాటి వర్షానికే రహదారిపై మురుగునీరు చేరి ప్రజల అవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సెలూన్‌కు కుర్చీ వితరణ



తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధి లోని ప్రాతూరు గ్రామానికి చెందిన కావూరు శివయ్య అనే బార్బర్ కి, తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆర్థిక సహాయంతో ఆదివారం సెలూన్ చైర్ ను తెలుగుదేశం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ప్రాతూరు రాజేష్, సంకురు బ్రిడ్జి రాజు, పాల్గొన్నారు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

13 నుండి ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎస్‌ఎఫ్‌ఐ 17వ అఖిల భారత మమాసభను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలాజీ, ఎం.కిరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కిరణ్ మాట్లాడుతూ డిసెంబర్ 13 నుంచి 16 వరకు ఎస్‌ఎఫ్‌ఐ 17వ అఖిలభారత మహాసభ హైదరాబాద్ నగరంలో, ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలో దేశంలోని విద్యారంగ సమస్యలపై చర్చించి, భవిష్యత్తు ఉద్యమాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. విద్యారంగంలో వచ్చిన మార్పులపై, నూతన జాతీయ విద్యావిధానం-2020పైనా చర్చిస్తారని, 13వ తేదీ భారీ బహిరంగ సభ ఉంటుందని, సభకు త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని అన్నారు. సభకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు రూపస్, సుధీర్, నాయకులు చందు, బాలాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు : ప్రభుత్వ ఉద్యోగులకు 11వ తేదీ వచ్చినా వేతనాలు అందలేదని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఛాంద్‌బాషా అన్నారు. తక్షణమే జీతాలు, పెన్షన్లు విడుదల చేయాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ అందే విధంగా అసెంబ్లీలో చట్టం చేసి, అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ డిఎలు చెల్లించేలా మంగళవారం నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో చర్చించి, తీర్మానం చేయాలని కోరారు.

నిబంధనల్లేకుండా ధాన్యం కొనాలి

- రైతు సంఘం డిమాండ్
- వర్షాలకు పంట దెబ్బతిన్న పొలాల్లో పరిశీలన


తెనాలి ఐతానగర్ డొంకరోడ్డులో తడిసిన వరిపంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రైతుల వద్ద ధాన్యాన్ని నిబంధనలేమీ లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్, ఉపాధ్యక్షులు పాశం రామారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో మండల కేంద్రమైన దుగ్గిరాల, ఈమని గ్రామంలో దెబ్బతిన్న పైర్లను రైతు సంఘం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకర్, రామారావు మాట్లాడుతూ ప్రతి విత్తనం కొంటామని ప్రభుత్వం ప్రకటన చేసిందని, జిల్లా కలెక్టర్ సైతం ఇదే చెబుతున్నారని గుర్తు చేశారు. అయితే ఎక్కడా కొనుగోలు కేంద్రాలు లేవని, రైతు భరోసా కేంద్రాల్లో గోతాలు లేవని అన్నారు. అధిక వర్షాలకు తీవ్ర నష్టం వాటిలో ప్రమాదం ఉందని, దుగ్గిరాల ప్రాతంలో 40 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నా ఇప్పుడది 10 బస్తాలు తగ్గే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి, మరో రూ.25 వేలు కౌలుకు ఖర్చు చేశారని, ఇప్పుడు తుపానును సాకుగా చూపి ధాన్యం ధరను రూ.1250 నుండి రూ.1100-1150కు దగ్గించారని, ఇలాగైతే రైతు ఎలా బతుకుతాడని ప్రశ్నించారు. దిగుబడిలో రూ.10 వేలు, పంట అమ్మకంలో రూ.10 వేలను రైతులు నష్టపోయేలా ఉన్నారని, రైతు భరోసా కేంద్రాలకు వెళ్లటానికే భయపడుతున్నారని చెప్పారు. గోతాలు లేవని, కాటాల పరిస్థితి తెలియడం లేదని, వీటిని సాకుగా చేసుకుని ప్రైవేటు వ్యాపారులు రైతులను మరింతగా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే బీపీటీ మొలకెత్తాయని, వాటితోపాటు మొలకెత్తిన వాటిని, ఇతర ధాన్యాన్ని తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలడి డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై 12వ తేదీన విజయవాడలో సివిల్ సప్లయీస్ కార్యాలయం వద్ద ధర్నాకు రైతులు పెద్దఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, నాయకులు వి.సాంబశివరావు, ఎన్.యోగేశ్వరరావు, ఈశ్వర్‌రెడ్డి, జె.బాలరాజు, కె.కోటయ్య, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

అకాల వార్షలతో రైతులు నష్టపోయారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. రెండ్రోజులుగా వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న వరి స్థానిక ఐతానగర్ డొంకరోడ్డులో నీట మునగడంతో నాయకులు పరిశీలించారు. రైతులు ఈదర అంకినీదు, కన్నెగంటి శ్రీనివాసరావు, వెలగపూడి శ్రీహర్ష తమ గోడును వెళ్లబోసుకున్నారు ఇప్పటికే ఎకరానికి రూ.22 నుంచి రూ.25 వేల వరకూ పెట్టుబడులు పెట్టామని ఆవేదన వ్యక్తం చేశారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విదంగా రైతులు నష్టపోకుండా, చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు లేకపోవటం, ఈ-క్రాప్‌లో అవకతవకలతో ప్రస్తుతం రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. వాతావరణ శాఖ ముందస్తు వర్ష సూచనతో రైతుల కంటే దళారులు అప్రమత్తమయ్యారని ఎద్దేవ చేశారు. ఓ వైపు వర్షం నుంచి పంటను ఎలా కాపాడుకోవాలనే తపనలో రైతులుంటే, దళారులు మాత్రం ఇదే అదనుగా భావించి, బస్తాకు రూ.250 వరకూ తగ్గించి కళ్లాల మీదే కొనుగోలు చేసి రైతులను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.చిట్టిబాబు, రైతులు పాల్గొన్నారు.

మోకీలు సర్జరీలు త్వరలో పునరుద్ధరణ

- గుండె ఆపరేషన్లనూ ప్రారంభిస్తాం
- కొన్ని వార్డుల్లో మంచాల కొరత
- ప్రజాశక్తితో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి

ఇంటర్వ్యూ

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో వైద్యసేవలను మెరుగుపరిచేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని సూపరింటెఒడెంట్ డాక్టర్ నీలం ప్రభావతి తెలిపారు. నిలిచిపోయిన మోకీలు ఆపరేషన్లను త్వరలో పునరుద్ధరిస్తామన్న ఆమె ఆస్పత్రిలో ఇప్పటికీ కొన్ని వార్డుల్లో రద్దీ ఉందన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

మోకీలు ఆపరేషన్ల పునరుద్ధరణ ఎప్పుడు?

దీనిపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

కొన్ని వార్డుల్లో ఒకే మంచంపై ఇద్దరు రోగులు ఉంటున్నారు?

ఆస్పత్రికి రోగుల తాకిడి రోజు రోజుకూ పెరుగుతోంది. కొన్ని వార్డుల్లో ఇన్‌పెషెంట్స్ ఎక్కువ మంది ఉంటున్నారు. చాలినన్ని మంచాలు లేవు. దీని వల్ల ఒక్కో మంచంపై ఇద్దరు ఉంటున్నారు. మొత్తం 1500 మంది రోగులుంటే 1260 మంచాలే ఉన్నాయి. అందువల్ల తరచూ పలు వార్డుల్లో మంచాల కొరత తలెత్తుతోంది.

వైద్య పరీక్షల్లో ప్రైవేటు ఏజెన్సీలు బాగా డబ్బు వసూలు చేస్తున్నాయి కదా?



ఆరోగ్యశ్రీ ఉన్నా లేకున్నా పరీక్షలు ఉచితంగా చేయాలని చెబుతున్నాం. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం సంబంధిత ఏజెన్సీ సిబ్బంది ఉచితంగా వైద్య పరీక్షలు చేయాల్సిందే.

గుండె ఆపరేషన్లు ఎప్పుడు ప్రారంభిస్తారు?

గుండె విభాగానికి ప్రొఫెసరు, ఇతర వైద్యుల పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రస్తుతం వివిధ స్థాయిలో చికిత్సలు జరుగుతున్నాయి. ఇంకా ఆపరేషన్లు చేయడం లేదు. చేయడానికి త్వరలో చర్యలు తీసుకుంటాం.

నాట్కో కేన్సర్ చికిత్సలు ఎలా జరుగుతున్నాయి.?

రేడియోథెరఫీకి 70 మంది, కిమోథెరఫీకి 30 మంది వస్తున్నారు. సాధారణ పరీక్షలకు 100 మందికి పైగా వస్తున్నారు. ఈ వార్డుకు కూడా రోగుల తాకిడి పెరిగింది. సర్జరీలు నెలకు 60-70 వరకు జరుగుతున్నాయి. రూ.కోటితో నాట్కో కేన్సర్ సెంటర్‌లో నూతనంగా త్రిడి డిజిటల్ మమ్మోగ్రఫీ మెషీన్‌ను ఏర్పాటు చేశాం. మహిళలలో రొమ్ము కేన్సర్‌ను ముందుగా గుర్తించడంలో ఈ పరికరం ఉపయోగపడుతుంది.

కీలక విభాగాల్లో ఖాళీలన్నీ భర్తీ అయ్యాయా?

కీలక విభాగాల్లో పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. న్యూరాలజీ, కార్డియాలజీ, ఆర్థోపేడిక్, గైనకాలజీ తదితర వార్డుల్లో ఏ సమస్యా లేదు.

ఆరోగ్యశ్రీ సేవలు ఎలా ఉన్నాయి?

ఆరోగ్యశ్రీ ద్వారా మేం అందిస్తున్న సేవల వల్ల ప్రభుత్వం రీయింబర్సుమెంట్ సొమ్ముతో ఖరీదైన వివిధ వైద్య పరికరాలు సమకూరుస్తోంది. ఇటీవల రోగులకు కోత, కుట్టు లేకుండా సర్జరీలు నిర్వహించే ఎండోస్కోపి పరికరం అందించారు.

ఎంసిహెచ్ భవన నిర్మాణం ఎలా జరుగుతోంది?

నిర్మాణం ప్రారంభమైంది. వచ్చే ఏడాదికి ఈ భవనం అందుబాటులోకి వస్తుంది. 600 పడకలతో తల్లీపిల్లల వార్డు సిద్ధమవుతోంది.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి


బహుమతులు పొందిన వివిధ పాఠశాలల విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

విజేతలుగా గణపవరం జెడ్‌పి, గురజాల అక్షర

ముగిసిన జెవివి పల్నాడు జిల్లా చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

జనవిజ్ఞాన వేదిక (జెవివి) పల్నాడు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రొంపిచర్ల తహశీల్దార్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం పెంపొందించడానికి ఈ చెకుముకి సైన్ సంబరాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి మాట్లాడుతూ పిల్లలందరూ భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆల్ ఇండియా పీపుల్ సైన్స్ నెట్‌వర్క్ సభ్యులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం సంబరాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

జిల్లా చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విభాగం నుండి ప్రథమ బహుమతి నాదెండ్ల మండలం గణపవరం జెడ్‌పి పాఠశాల, ద్వితీయ బహుమతిని ముప్పాళ్ల మండలం నార్నెపాడు జెడ్‌పి పాఠశాల, తృతీయ బహుమతిని గురజాల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగం నుండి ప్రథమ బహుమతి అక్షర స్కూల్ గురజాల, ద్వితీయ బహుమతి చైతన్య లిటిల్ స్కూల్ చిలకలూరిపేట, తృతీయ బహుమతిని వివేక టెక్నో స్కూల్ రెంటచింతల విద్యార్థులు సాధించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు డి.బుచ్చిబాబు, ఎన్.హనుమంతరావు, పిడుగురాళ్ల డివిజన్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్‌బాషా, ఎల్.ధనలక్ష్మి, ఇమ్మానియేల్, జెవికెఎస్ ప్రసాద్, ఆదినారాయణ, చలపతి, కె.నరసింహారావు, లయన్ సతీష్, బాల చిన్నమ్మ, మధు కుమార్, యుటిఎఫ్ నాయకులు ఖాసిం పీరా, జమాల్, క్విజ్ మాస్టర్లు దయాకర్, గంగాధర్, టి.శ్రీనివాసరావు, ఆయేషా, వంశీ, సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.